క్లుప్తంగా

వ్యవసాయ భూమికి దారిని ఏర్పాటు చేయండి



ఆర్మూర్: మండలంలోని ఇస్సాపల్లికి చెందిన దళిత రైతు నీరడి సాయన్న వ్యవసాయ భూమిలోనికి వెళ్లడానికి దారిని కల్పించాలని కోరుతూ ప్రజా సంఘాల నాయకులు ఆర్మూర్ ఆర్డీవో రాజాగౌడ్‌కు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. అనంతరం ప్రజా సంఘాల నాయకులు సావెల్ గంగన్న, దేవరాం విలేకరులతో మాట్లాడారు. బాధితుని ఫిర్యాదు మేరకు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిజ నిర్ధారణ కమిటీని వేసి క్షేత్ర స్థాయిలో సమస్యను పరిశీలించామన్నారు. సమస్యను పరిశీలించి పరిష్కరించాలని ఆర్డీవోను కోరారు. నాయకులు కిషన్, లింబాద్రి, రవి, బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై జాగ్రత్తగా ఉండాలి

రుద్రూర్: విద్యార్థులు సైబర్ మోసాలపై జాగ్రత్తగా ఉండాలని ఎస్సై సాయన్న సూచించారు. మండల కేంద్రంలో రైడ్ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సైబర్ నేరాలు, మహిళల రక్షణ, ట్రాఫిక్ నిబంధనలు గూర్చి వివరించారు. అనంతరం విద్యార్థులకు స్థానిక ఫాస్ట్ ఫుడ్ సెంటర్ నిర్వాహకుడు గంగాధర్ అల్పాహారం అందజేశారు. కార్యక్రమంలో సింగిల్ విండో మాజీ చైర్మన్ పత్తి రాము, రైడ్స్ అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణ ప్రసాద్, శేఖర్, మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక టిప్పర్ యజమానులపై చర్యలు తీసుకోవాలి

బోధన్: ఇసుక టిప్పర్ యజమానులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ స్థానిక జర్నలిస్టులు బోధన్ సబ్‌కలెక్టర్ కార్యాలం ఎదుట శుక్రవారం నిరసన తెలిపారు. ఓ పత్రిక, న్యూస్ చానల్‌కు చెందిన రిపోర్టర్ల దిష్టిబొమ్మలను ఇసుక టిప్పర్ యజమానులు గురువారం దహనం చేయడంపై నిరసన కార్యక్రమం చేపట్టారు. వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, పట్టణ సీఐ వెంకటనారాయణకు జర్నలిస్టులు వినతిపత్రాలు అందజేశారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నవీపేట: మండలంలోని రాంపూర్ సబ్ స్టేషన్‌లో శనివారం మరమ్మతులు చేపడుతున్నట్లు ట్రాన్స్‌కో ఏడీఈ ప్రశాంత్ రెడ్డి శుక్రవారం తెలిపారు. దీంతో సబ్ స్టేషన్ పరిధిలోని రాంపూర్, ఎల్‌కే ఫారం, ఫతేనగర్, ఫస్ట్ ఫ్లాట్, దర్యాపూర్ తండాలో శనివారం మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు కరెంటు సరఫరాలో అంతరాయం ఉంటుందని అన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

బార్లకు దరఖాస్తుల ఆహ్వానం

బోధన్‌టౌన్: బోధన్ మున్సిపల్ పరిధిలో నూతన బార్ల ఏర్పాటుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ భాస్కర్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ పరిధిలో గతంలో నోటిఫై చేసిన 2–బి(1) కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 15 నుంచి జూన్ 6 వరకు దరఖాస్తులను జిల్లా ఎక్సైజ్ కార్యాలయంలో అందించాలన్నారు.

ఏఎల్‌ఎం మృతి బాధాకరం



బోధన్‌రూరల్: విధి నిర్వహణలో విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన ఏఎల్‌ఎం మహేందర్ మృతి తీరని లోటని ట్రాన్స్‌కో బోధన్ డీఈ ఎండీ ముక్తార్ అన్నారు. గురువారం మండలంలోని రాజీవ్‌నగర్ తండాలో ఏఎల్‌ఎం మహేందర్ మరమ్మతులు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. శుక్రవారం పట్టణంలోని డివిజన్ కార్యాలయంలో అధికారులు, సిబ్బంది మహేందర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఏడీఈ నాగేశ్, ఏఈలు నాయిని కృష్ణ, కళ్యాణ్ మారుతి తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో ఎంపీడీవో కార్యాలయం

- భవనం ఫైపెచ్చులు ఊడుతున్న వైనం
- ఇబ్బంది పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు





శిథిలావస్థలో ఉన్న మండల పరిషత్ కార్యాలయం

బాల్కొండ : బాల్కొండ మండల పరిషత్ కార్యాలయం శిథిలావస్థకు చేరింది. భవనం పైపెచ్చులు ఊడి పడుతుండడంతో కార్యాలయానికి వచ్చే ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. 1984లో బాల్కొండ మండల పరిషత్ కార్యాలయాన్ని నిర్మించారు. నాలుగు దశాబ్దాల భవనంపై సరైన నిర్వహణ లేక పోవడంతో ఎప్పుడు కూలుతుందో తెలియని దుస్థితిలో ఉంది. భవనం పైకప్పు పెచ్చులూడి పోయాయి. నిత్యం ఒక చోట పెచ్చులూడుతున్నాయి. 2018 వరకు ఉమ్మడి బాల్కొండ(బాల్కొండ, ముప్కాల్, మెండోరా) మండలాల ప్రజలకు పెద్ద దిక్కు అయింది. ఉమ్మడి బాల్కొండ మండలంలో 25 గ్రామ పంచాయతీలకు పెద్ద దిక్కుగా ఉంటూ, రాష్ట్రంలో బాల్కొండ నియోజకవర్గ కేంద్రంగా ఒక వెలుగు వెలిగింది. కానీ ప్రస్తుతం చిన్నబోతోంది. మండల పరిషత్ కార్యాలయ భవనం పెచ్చులూడుతూ.. శిథిలావస్థకు చేరింది. అయినా పాలకులు, ఉన్నతాధికారుల్లో స్పందన కరువైంది. ఈ కార్యాలయంలో మండల పరిషత్‌తో పాటు ఈజీఎస్ కార్యాలయాన్ని నిర్వహిస్తున్నారు. అంతేకాకుండా ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత నుంచి ఇప్పటి వరకు మండల పరిషత్ కార్యాలయం మెయింటెనెన్స్ కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేయలేదు. దీంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి ఎలాంటి ప్రాణనష్టం జరగకముందే తగు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

మరమ్మతులు చేపట్టాలి



బాల్కొండ మండల పరిషత్ కార్యాలయ భవనానికి వెంటనే మరమ్మతులు చేపట్టాలి. వర్షాకాలంలో భవనం ఊరుస్తోంది. మెయింటెనెన్స్ లేక పోవడం వలనే ఇలా జరుగుతుంది. మేయింటెనెన్స్ కోసం నిధులు మంజూరు చేయాలి.

– రియాజొద్దీన్, బాల్కొండ

పరిసరాలను శుభ్రంగా ఉంచాలి

- డిప్యూటీ డీఎంహెచ్‌వో రమేశ్
- గ్రామాల్లో డెంగీపై అవగాహన ర్యాలీ



ఆర్మూర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారులు



పెర్కిట్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

ఆర్మూర్‌టౌన్/ పెర్కిట్/ మాక్లూర్/ నందిపేట/ నవీపేట: ప్రజలు తమ ఇంటి పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో రమేశ్ సూచించారు. ఆర్మూర్ పట్టణంలోని అర్బన్ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో శుక్రవారం నేషనల్ డెంగీ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. జూన్ నుంచి సీజనల్ వ్యాధులు సంక్రమించే అవకాశం ఉంటుందని, వైద్య సిబ్బంది డెంగీ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రతిఒక్కరికి అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఫాతిమా ఫెర్డోస్, సబ్ యూనిట్ ఆఫీసర్ సాయి, హెల్త్ అసిస్టెంట్ ఆనంద్, శాంత, రాజవ్వ, కమల, శ్యామల, స్వాతి, విజయశ్రీ, ఆశావర్కర్లు పాల్గొన్నారు. జాతీయ డెంగీ వ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గోవింద్‌పేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో పెర్కిట్ వద్ద అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్త్ సూపర్‌వైజర్ అనసూయ కుమారి మాట్లాడుతూ.. రానున్న వర్షాకాలంలో దోమల నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ఇంటితో పాటు పరిసరాల్లో నీటి నిలువలు లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు ఎస్తేరు రాణి, జక్కుల మోహన్, అరుణ, కవిత, గణేశ్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. మాక్లూర్ మండల కేంద్రంలో మండల వైద్యాధికారి రవిశంకర్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆయూష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. నందిపేట మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, జిల్లా మలేరియా కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో డెంగీ వ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని అవగాహన ర్యాలీ నిర్వహించారు. నందిపేటలోని బస్టాండ్, కూరగాయల మార్కెట్, ఆటో స్టాండ్‌లలో కరపత్రాలను పంచిపెడుతూ దోమల వల్ల వ్యాధుల గురించి ఆరోగ్య సిబ్బంది వివరించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి ప్రవీణ్, పద్మావతి, భాస్కర్, భూమేశ్వర్, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు. నవీపేట మండల కేంద్రంలో వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ సామ్రాట్ యాదవ్, కావ్య, ప్రవళిక, స్టాఫ్ నర్స్ రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.



మాక్లూర్‌లో వైద్య సిబ్బంది



నందిపేటలో..



నవీపేటలో

గ్రామాల్లో జీలుగ విత్తనాల పంపిణీ

బోధన్/మాక్లూర్/కమ్మర్‌పల్లి : రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న జీలుగ విత్తనాలను సాలూర ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆవరణలో సొసైటీ చైర్మన్ అల్లె జనార్దన్ వైస్ చైర్మన్ సందీప్‌రెడ్డి, డైరెక్టర్లతో కలిసి రైతులకు శుక్రవారం పంపిణీ చేశారు. సబ్సిడీపై 30 కేజీల బస్తాకు రూ.2137.50 ధర చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అవసరం ఉన్న రైతులు పట్టాపాస్ బుక్, ఆధార్‌కార్డు జిరాక్స్‌లతో కార్యాలయంలో సంప్రదించాలన్నారు. డైరెక్టర్లు గంటె హోట్లప్ప, రైతులు పీరాజీ, శివరాజ్, నర్సయ్య, మారుతి, ఏఈవో శ్రావణి పాల్గొన్నారు. మాక్లూర్ మండల కేంద్రంలోని వ్యవసాయ పరపతి సంఘ భవనంలో చైర్మన్ బూరోల్ల అశోక్, మండల వ్యవసాయ అధికారి పద్మ రైతులకు జీలుగ విత్తనాలను పంపిణీ చేశారు. జీలుగ సాగుతో నేల సారవంతమవుతుందని కమ్మర్‌పల్లి మండల వ్యవసాయాధికారి రమ్యశ్రీ అన్నారు. కమ్మర్‌పల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో జీలుగ విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని చైర్మన్ రేగుంట దేవేందర్, ఏవో రమ్యశ్రీ ప్రారంభించారు. మండలానికి 250 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు వచ్చినట్లు తెలిపారు.



సాలూరలో విత్తనాలను పంపిణీ చేస్తున్న చైర్మన్



మాక్లూర్‌లో సొసైటీ చైర్మన్ బూరోల్ల అశోక్



కమ్మర్‌పల్లిలో సొసైటీ చైర్మన్ దేవేందర్

బేకరీ, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ల తనిఖీ

ఆర్మూర్‌టౌన్: బేకరీ, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ల యజమానులు ప్రజలకు నాణ్యమైన ఆహార పదార్థాలను అందించాలని శానిటరి ఎస్సై గజానంద్ అన్నారు. ఆర్మూర్ పట్టణంతో పాటు పెర్కిట్, మామిడిపల్లిలో మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం పలు దుకాణాలను తనిఖీ చేశారు. సింగిల్ యూస్ ప్లాస్టిక్ వాడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్విరాన్మెంట్ ఇంజినీర్ పూర్ణమాళి, సిబ్బంది అక్షయ్, సంతోష్, రాము తదితరులు ఉన్నారు.

సర్కార్ బడిలోనే చక్కని విద్య

బాల్కొండ: సర్కారు బడుల్లోనే చక్కని విద్య అందుతుందని ఎంఈవో రాజేశ్వర్ అన్నారు. తల్లితండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. శుక్రవారం మండలంలో పలు గ్రామాల్లో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

త్రివిధ దళాలకు విజయ నీరాజనాలు



ఆర్మూర్‌టౌన్: పాకిస్తాన్‌పై జరిగిన యుద్ధంలో విజయానికి కారణమైన భారత త్రివిధ దళాలకు, యుద్ధరంగంలో ధైర్యసాహసాలు చూపిన వీరులకు ఆర్మూర్ పట్టణంలోని న్యాయవాదుల బార్ అసోసియేషన్ సభ్యులు అభినందనలు తెలుపుతూ జాతీయ పతాకాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో బార్ అధ్యక్షుడు జక్కుల శ్రీధర్, జెస్సు అనిల్ కుమార్, గటడి ఆనంద్, మద్దుల గంగారాం, లోకభూపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శుభకార్యానికి హాజరైన టీపీసీసీ అధ్యక్షుడు



పెర్కిట్: పెర్కిట్‌లో శుక్రవారం నిర్వహించిన బంధువుల వివాహ శుభ కార్యానికి టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్ హాజరయ్యారు. కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డి, నాయకులు ఆయనకు స్వాగతం పలికారు. అలాగే పెర్కిట్ మర్కజ్ కమిటీ సభ్యులు మహేశ్‌కుమార్‌ను గౌడ్‌ను కలిసి పలు సమస్యలను ప్రస్తావించారు. అనంతరం ఆయనను సన్మానించారు.

బ్రిడ్జి రక్షణకు చర్యలు చేపట్టాలి



రుద్రూర్: బొప్పాపూర్–రుద్రూర్ రహదారిపై ఉన్న వాగులో ఇసుక, మట్టి తవ్వకాలు చేపట్టడంతో ప్రమాదకర గుంతలు ఏర్పడ్డాయి. వర్షాకాలంలో ఉధృతంగా ప్రవహించే వాగులో ఎండ కాలం చుక్క నీరు ఉండదు. వర్షాలు విస్తృతంగా కురిస్తే రహదారిపై నుంచి వరద ప్రవహిస్తుంది. ప్రస్తుతం నీరు లేనందున అక్రమార్కులు బ్రిడ్జికి కొద్ది దూరంలో తవ్వకాలు చేపట్టి ఇసుక, మట్టిని తరలిస్తున్నారు. సంబంధిత అధికారులు బ్రిడ్జి రక్షణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



పెర్కిట్: ఆలూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1993–94 కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు శుక్రవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. గురువులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రిటైర్డ్ హెచ్‌ఎం శంకర్, ఉపాధ్యాయులు రాజేందర్, దామోదర్, శ్యామ్, మనోహర్, గోవర్ధన్, నారాయణ, శంకర్, భూమయ్య, విద్యార్థులు కల్లెం మోహన్, దుమ్మాజి శ్రీనివాస్, కల్లా గౌడ్, గుజ్జుల రవీందర్, భాస్కర్, సుధాకర్, గంగామణి, సంగీత, విజయ, లలిత తదితరులు పాల్గొన్నారు.



బోధన్: సాలూర మండలంలోని హున్సా మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో 1997–98లో 7వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 28 ఏళ్ల తర్వాత మిత్రులందరూ అందరూ ఒకే చోట చేరడంతో సంతోషం వ్యక్తం చేశారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. కార్యక్రమంలో ఎస్‌ఎంసీ చైర్మన్ సికారి నారాయణ, హెచ్‌ఎం నగేశ్, పూర్వ విద్యార్థులు దత్తాత్రి, రవి, నగేశ్, పల్లె అశోక్, రాము, జ్యోతి, మాధవి తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ ప్రక్రియను వేగవంతం చేయాలి

- మున్సిపల్ వార్డు ఆఫీసర్స్‌కు సబ్ కలెక్టర్ వికాస్ మహతో దిశానిర్దేశం



సమావేశంలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ వికాస్ మహతో

బోధన్: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ ప్రక్రియను వేగవంతం చేయాలని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో మున్సిపల్ వార్డు ఆఫీసర్స్‌కు సూచించారు. శుక్రవారం పట్టణ కేంద్రంలోని సబ్ కలెక్టర్ ఆఫీస్ మీటింగ్ హాల్‌లో పట్టణంలోని మున్సిపల్ ఆఫీసర్స్‌తో ఇందిరమ్మ ఇళ్ల పథకం పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు, నిబంధనలు, పలు అంశాల పై పవర్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. మున్సిపల్ కమిషనర్ వెంకట నారాయణ, గృహ నిర్మాణ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ



నూత్‌పల్లిలో భూమి పూజ చేసిన అధికారులు



ఆలూర్‌లో మంజూరు పత్రాలను అందజేస్తున్న వినయ్‌రెడ్డి

డొంకేశ్వర్: మండలంలోని నూత్‌పల్లిలో ఇందిరమ్మ ఇళ్లకు అధికారులు శుక్రవారం ముగ్గు పోసి భూమి పూజ చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆర్మూర్ డివిజనల్ పంచాయతీ అధికారి శివకృష్ణ ఇద్దరు లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణానికి కొబ్బరికాయలు కొట్టారు. గ్రామానికి మొత్తం 42 ఇళ్లు మంజూరైనట్లు తెలిపారు. లిఫ్టుల చైర్మన్ మోర్తాడ్ భోజారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు వనజ, మోహన్, కారోబార్ స్వామి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆలూర్‌లో..

పెర్కిట్: ఆలూర్ మండల కేంద్రంతో పాటు దేగాం గ్రామాల లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల పథకంలో ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం నుంచి మంజూరు లభించింది. ఆలూర్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డి లబ్ధిదారులకు నిధుల మంజూరు పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముక్కెర విజయ్, ఎంపీడీవో గంగాధర్, నాయకులు పాల్గొన్నారు.

గోనుగొప్పులలో..

మోర్తాడ్: భీమ్‌గల్ మండలంలోని గోనుగొప్పుల, బెజ్జోరా, పురాణిపేట్, బాబాపూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్‌రావు మార్కింగ్ చేశారు. మాజీ సర్పంచ్ భోజాగౌడ్, నాయకులు చరణ్‌గౌడ్, బొర్రన్న, వంజరి శంకర్, భూమేష్, శేఖర్, ఎంపీడీవో సంతోష్‌కుమార్, ఎంపీవో జావిద్, జీపీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సాలూరలో..

బోధన్: సాలూర మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు తహసీల్దార్ శశిభూషణ్, ఎంపీడీవో శ్రీనివాస్, సాలూర, హున్సా సొసైటీల చైర్మన్ అల్లె జనార్దన్, మందర్నా రవి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ డిష్కో సాయిలు, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్, నాయకులు అల్లె రమేశ్, భుయ్యాన్ సురేశ్ పటేల్, సొక్కం రవి, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఎమ్మెస్సీఫారంలో..

ఎడపల్లి(బోధన్): ప్రభుత్వ నిబంధనల ప్రకారమే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు చేపట్టాలని బోధన్ డీఎల్‌పీవో నాగరాజ్ అన్నారు. ఎడపల్లి మండలం ఎమ్మెస్సీఫారం గ్రామంలో లబ్ధిదారులు చేపడుతున్న ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులకు ముగ్గులు పోసి ప్రారంభించారు.

లోతు దుక్కులు చేసుకోవాలి



రుద్రూర్: వేసవిలో పంట కోత తర్వాత లోతు దుక్కులు చేసుకోవాలని రుద్రూర్ ప్రాంతీయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త టీ రాకేశ్ సూచించారు. కోటగిరి మండలం యాద్గార్‌పూర్ గ్రామంలో శుక్రవారం 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోతు దుక్కులు చేస్తే తెగుళ్లు, పురుగుల ఉధృతి తగ్గడంతోపాటు నేల నీటి వినియోగ సామర్థ్యం పెరుగుతుందని, నేల కోతకు గురికాకుండా ఉంటుందన్నారు. నేల క్షారత్వం తగ్గి, నేల ఆరోగ్యం పెరుగుతుందన్నారు. పంట మార్పిడి చేస్తే తక్కువ వ్యయంతో ఎక్కువ దిగుబడి సాధించవచ్చునని వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ పద్మావతి అన్నారు. వాతావరణం మారుతున్న నేపథ్యంలో వర్షాలు మితంగా కురిసే అవకాశం ఉండటంతో నీటి కుంటలు ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం రైతుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో బోధన్ ఏడీఏ అలీం అహ్మద్, మండల వ్యవసాయాధికారి టీ రాజు, ఏఈవో సందీప్, రైతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఆలయ ప్రతిష్ఠాపన ఉత్సవాలు



హాజరైన గంగోత్రి పీఠాధిపతితో వినయ్‌రెడ్డి

డొంకేశ్వర్ : మండలంలోని నికాల్‌పూర్‌లో శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి నూతన ఆలయ, విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. మూడవ రోజు మూర్తులకు చాయాస్నపనం, ఆవాహిత దేవతాపూజ, యజ్ఞ హోమాలు నిర్వహించారు. గంగోత్రి పీఠాధిపతి రామానుజ దాసస్వామి సమక్షంలో కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఆలయ ప్రహారి నిర్మాణానికి రూ.20లక్షలు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఆలయ కమిటీ చైర్మన్ తిరుపతి రెడ్డి, వీడీసీ ప్రతినిధులు రావుల సుభాష్, భీమ్‌నాయక్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గొడిసెరం భూమేశ్ రెడ్డి, సుమన్ నాయక్ తదితరులు ఉన్నారు.

ఆధ్యాత్మికం..

ఘనంగా దేవమ్మ ఉత్సవాలు

బాల్కొండ: మండలంలోని వన్నెల్(బి)లో శుక్రవారం దేవమ్మ తల్లి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు బోనాలను అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ముప్కాల్ మండలం రెంజర్లలో స్థానిక శాలివాహన సంఘం ఆధ్వర్యంలో రామవ్వ తల్లి ఉత్సవాలను నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేపట్టారు.

సమాచారం..

నేడు రైతు ముంగిటకు శాస్త్రవేత్తలు

బాల్కొండ : మెండోరా మండల కేంద్రంలో శనివారం రైతు ముంగిటకు శాస్త్ర వేత్తలు అనే కార్యక్రమాన్ని స్థానిక గురడి కాపు సంఘంలో నిర్వహించనున్నట్లు వ్యవసాయ అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

సినిమా

పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్)

స్క్రీన్-3 సింగిల్ -11.05, శుభం -1.50, ఫైనల్ డెస్టినేషన్ బ్లడ్‌లైన్స్(తెలుగు)-4.30, హిట్ -7.00,ఎంఐ - 10.15

స్క్రీన్-4 ఎంఐ-10.00,4.20, డెవిల్స్ డబుల్ నెక్స్ట్ లెవెల్ -1.30, సింగిల్ -5.05,7.50, ఫైనల్ డెస్టినేషన్ బ్లడ్‌లైన్స్ -10.35

మాంసం ధరలు (రూ..)

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	180
		లైవ్	140
స్కిన్‌లెస్	200	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	96,400	వెండి(కిలో)	1,01,500
22 క్యారెట్స్	88,985		

– నిజామాబాద్ బిజినెస్

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయండి



ఆర్మూర్: ఆర్మూర్ మండలం క్షత్రియ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థుల పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ బిల్లులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఆర్మూర్ పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట 'క్షత్రియ' విద్యార్థులు, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ ధర్నానుద్దేశించి పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ఎం నరేందర్, యూఎస్‌ఎఫ్‌ఐ డివిజన్ అధ్యక్షుడు నాగరాజు, పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు అనిల్ కుమార్ మాట్లాడుతూ.. ఫీజు రీయింబర్స్‌మెంట్ బిల్లులు మంజూరు కాకపోవడంతో జిల్లాలోని పలు ఇంజినీరింగ్ కళాశాలల వారు విద్యార్థులను పరీక్షలకు హాజరు కానివ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారన్నారు. ఈ నెల 20న పరీక్ష ఫీజు చెల్లింపునకు చివరి రోజు కావడంతో కలెక్టర్ ఇంజినీరింగ్ కళాశాలల యాజమాన్యాలతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్మూర్ ఆర్డీవో రాజాగౌడ్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ధర్నాలో పీడీఎస్‌యూ, యూఎస్‌ఎఫ్‌ఐ నాయకులు పాల్గొన్నారు.